# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొంటారు.**
2. **కరోనా పై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖమంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**
3. **ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఇరు రాష్ట్రాల మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు.**
4. **తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ పాలిసెట్ ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. దీనిలో భాగంగా నిన్న పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమైయ్యారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్,ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్, జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ లతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 29 సెకన్లు

కాగా ఈ రోజు నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలను ప్రస్తావించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

కరోనా పై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖమంత్రి వై.

సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఏపీఐసీసీ భవనంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కొవిడ్, కాలానుగుణ వ్యాధులపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నంలో ఒక కేసు మాత్రమే నమోదైందని చెప్పారు. వైద్యారోగ్య శాఖ కరోనా పై అప్రమత్తంగా ఉందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 16 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ, టెట్ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే విడుదలైన షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. టెట్, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ వాయిదా వేయాలని కోరుతూ ఆరుగురు అభ్యర్థులు సుప్రీంకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో సరైన కారణాలు లేవని ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఆయా పరీక్షల షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని ఆదేశాలు జారీ చేసింది. కాగా రాష్ట్రంలో మొత్తం 16 వేల 347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ జారీ చేసింది. జూన్ 6 నుంచి జులై 6 వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాలశాఖ భవన్‌లో ఇరురాష్ట్రాల మంత్రులు నిన్న సమావేశమయ్యారు అనంతరం నాదెండ్ల మనోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల పౌరసరఫరా విధానాలు, సాంకేతికత, అంతర్రాష్ట్రాల మధ్య ధాన్యం అక్రమ రవాణా కట్టడి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించామన్నారు. కాకినాడ నుంచి ఫిలిప్పిన్స్‌కు తెలంగాణ బియ్యం ఎగుమతి చేస్తున్నామని అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలపై చర్చించామని తెలుపుతూ,

వాయిస్ 19 సెకన్లు

మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఉన్న ఏపీ సివిల్ సప్లై భవన్‌ను పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తున్నారని తెలిపారు.

వాయిస్ 13 సెకన్లు

---------------------------

తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 13వ తేదీన నిర్వహించిన టీజీ పాలిసెట్ ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో పరీక్ష ఫలితాలను ఈ ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలంగాణ సాంకేతిక విద్య, శిక్షణ మండలి – ఎస్‌బీటెట్ కార్యదర్శి బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పరీక్షకు మొత్తం లక్షా 6 వేల 716 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 98 వేల 858 మంది పరీక్ష రాశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో 200 కోట్ల రూపాయలతో గ్లోబల్ సెంటర్ ఆఫ్ మిల్లెట్స్ ఏర్పాటు

చేయనున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చిరుధాన్యాలపై పరిశోధన, ఉత్పత్తిలో హైదరాబాద్ కీలకం కానుందన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మూడు ప్రతిష్ఠాత్మక సంస్థలను కేటాయించిందని కిషన్ రెడ్డి తెలుపుతూ,

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ సుందరి పోటీలకు ఎంపికైన టాప్ 20 ఫైనలిస్టుల జాబితాను తాజాగా ప్రకటించారు. 107 మంది పోటీదారులు పాల్గొన్న ఈ పోటీలో వారు తమ వ్యక్తిత్వాన్ని, సామాజిక స్పృహను ప్రదర్శిస్తూ, మానసిక ఆరోగ్యం, మహిళల సాధికారత, విద్య, పర్యావరణ సంరక్షణ, సాంస్కృతిక పరిరక్షణ సామాజిక దృక్పథ వంటి విషయాలపై ప్రసంగించారు. వారి ప్రతిభ, ఆలోచనల స్పష్టత, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాల ఆధారంగా 20 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా వీరిలో భారత్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తాకు అవకాశం దక్కలేదు.

---------------------------

బంగాళాఖాతంలో ఈ నెల 27 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈ రోజు, రేపు ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎం వెంకటరావు తెలియజేస్తూ,

వాయిస్ ..20.. సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో సహాయపడుతుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకిలో నిర్వహించిన కార్యక్రమంలో 150 మంది లబ్ధిదారులకు జీవనోపాధి కోసం తోపుడు బళ్లను అందజేశారు. అదే విధంగా దాదాపు 100 మంది లబ్దిదారులకు 60.55 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

=====================